జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 7 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5

## పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి, సీతారాంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 6,(ప్రజా జ్యోతి)** పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, సిబ్బంది పని తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వార్డులు, రక్త పరీక్షల విభాగం, ఔషధ నిల్వ గది, ఫార్మసీ తదితర విభాగాలను

మిగతా 2 లో...





## అధికారపక్షమైనా.. ప్రతిపక్షమైనా..
# ప్రజల పక్షమే ఎర్రజెండా

- కూనంనేని సాంబశివరావు
- ఈ బయ్యారంలో సీపీఐ ప్రజా చైతన్య యాత్రకు ఘన ప్రారంభం
- ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని హామీ

**పినపాక, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి)** పినపాక మండలం ఈ బయ్యారంలో సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. అనంతరం హమాలీ సంఘం కార్యాలయం, క్రాస్‌రోడ్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అలాగే కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరం క్రాస్‌రోడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా ప్రజల పక్షాన నిలబడేది ఎర్రజెండానే అని అన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తూ రైతులు, కార్మికులు, పేద ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, ఎరువులు, పురుగుమందుల ధరల

మిగతా 2 లో...



# చిమ్మచీకట్లో... సుందరయ్యనగర్

- విద్యుత్ స్తంభాల కొరతతో వీధి దీపాలు బంద్..
- ప్రజల్లో భయాందోళన

**బూర్గంపహాడ్,ఆగస్టు6 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని సుందరయ్య నగర్‌లో విద్యుత్ స్తంభాల కొరత కారణంగా రాత్రివేళ తీవ్ర చీకటి నెలకొంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం నుంచి కృష్ణ ఇంటి వరకు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను, గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని కోరుతున్నారు.ఇటీవల గోదావరి నది 56 అడుగులకు చేరి వరదలు రావడంతో సమీప జామాయిల్ తోటలు, పొలాల నుంచి విషసర్పాలు, ఇతర కీటకాలు కాలనీలోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళల్లో వీధి దీపాలు లేకపోవడంతో రోడ్లపై సంచరించే పాములు కనిపించక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని వాపోతున్నారు.అదేవిధంగా కాలనీలో విద్యుత్ స్తంభాలు తక్కువగా ఉండటంతో

మిగతా 2 లో...

## రూ.3.50 కోట్ల గంజాయి కాల్చివేత

◆ 696.1 కేజీల ఆదేశాల మేరకు దహనం



2 లో...

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- హైదరాబాద్ లో హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమీక్ష..
- నిమ్స్ లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శ
- రూ.7.50 లక్షల ఎల్ఓసీ పత్రాల అందజేత





**దమ్మపేట, ఆగస్టు 6(ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు వేగంగా అందేలా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఒకవైపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించగా, మరోవైపు తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నియోజకవర్గ ప్రజలను పరామర్శించి ప్రభుత్వ సహాయాన్ని అందజేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో

మిగతా 2 లో...

## రూ.3.50 కోట్ల గంజాయి కాల్చివేత



కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 6,(ప్రజాజ్యోతి) ఖమ్మం జిల్లా కొత్తగూడెం జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలో పట్టుబడిన రూ. 3.50 కోట్ల విలువ చేసే 696.1 కేజీల గంజాయిని ఖమ్మం డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి అదేశాల మేరకు గురువారం దగ్గం చేశారు. కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో 316.07 పేజీల గంజాయిని, భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లోని 329.51 కేజీల గంజాయిని, పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌లో 43.62 కేజీల గంజాయిని, మణుగూర్ ఎక్సైజ్ స్టేషన్ లోని 6.9 కేజీల గంజాయిని ప్రభుత్వ అమోదం పొందిన ఏ డబ్ల్యూఎస్ కన్సెటెనింగ్ గొపాల్‌పేట్ తల్లాడ మండలం లోని గంజాయి కాల్చివేత పరిశ్రమలో కల్చివేశారు. నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల లోని 32 కేసుల్లో పట్టుబడిన గంజాయిని దహనం చేయాలని ఖమ్మం డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి ఇచ్చిన అదేశాల మేరకు ఈఎస్ శ్రీనివాసరెడ్డి సీఐలు ఇతర సిబ్బంది కలిసి గంజాయిని కాల్చివేశారు.

## చిమ్మ చీకట్లో సుందరయ్య నగర్

(మొదటి పేజీ తరువాయి...)

ఒక్కో స్తంభంపై సుమారు 20 విద్యుత్ కనెక్షన్లు ఉండటం వల్ల తరచూ షార్ట్ సర్క్యూట్లు జరుగుతున్నాయని, దీంతో ఇంట్లోని విద్యుత్ పరికరాలు దెబ్బతింటున్నాయని స్థానికులు తెలిపారు.మరోసారి గోదావరి వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని సుందరయ్య నగర్ ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సారపాక మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గానికి విజ్ఞప్తి చేశారు.

## చర్లలో ఏటీసీ ఏర్పాటు చేయాలి

- గొండ్వాన సంక్షేమ పరిషత్ విజ్ఞప్తి



చర్ల, ఆగస్టు 06:(ప్రజా జ్యోతి): భద్రాచలం డివిజన్‌కు కేంద్ర బిందువైన చర్ల మండల కేంద్రంలో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేయాలని గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గురువారం చర్ల మండల కేంద్రంలో గొండ్వాన సంక్షేమ పరిషత్ మండల కార్యదర్శి కాయం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బీరబోయిన శేఖర్ ఈ మేరకు మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్లలో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తే దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం మండలాలకు చెందిన ఆదివాసీ యువతకు సాంకేతిక విద్యతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రస్తుతం కంప్యూటర్ యుగంలో రోబోటిక్స్, ఆటోమేషన్, ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఏటీసీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు .ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సుమారు 50 కొత్త అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదించిన నేపథ్యంలో వాటిలో చర్ల మండల కేంద్రానికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా సాంకేతిక విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బీరబోయిన అరుణ, మండల అధ్యక్షుడు ఇర్ప బాబు, తాటి వెంకటరావు, కనితి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారపక్షమైనా.. ప్రతిపక్షమైనా.. ప్రజల పక్షమే ఎర్రజెండా





(మొదటి పేజీ తరువాయి...)

పెరుగుదలను అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలను మంజూరు చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా కొత్తగూడెం జిల్లా రైతులకు సాగునీరు అందించ డంతో పాటు, బీటీపీఎస్, సీతారామ ప్రాజెక్టుల కారణంగా భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు తగిన నష్టపరిహారం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. పినపాక, కరకగూడెం మండలాల్లో పోడు భూముల వివాదాలను ప్రస్తావించిన సాంబశివరావు, పోడు రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పార్టీ అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తుందని స్ప ష్టం చేశారు. బందాగిరినగరం పోడు భూముల నిర్వాసితులకు న్యాయం జరిగే వర కు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యద ర్శి షాబీర్ భాషా, మండల కార్యదర్శి తోగటి కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డం మనోహరాచారి, పత్తిపాటి నాగేశ్వరరావు, కారం రమేష్, మండల సహాయ కార్యద ర్శులు కప్ప వెంకటేశ్వర్లు, హమాలీ సంఘం నాయకుడు కాసు జంపయ్య, సీపీఐ సీనియర్ నాయకుడు కమిశెట్టి రామారావు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి, సీతారాంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి...)

కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వార్డుల్లో పరిశుభ్రత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఔషధ నిల్వ గదిలో ఉన్న మందుల గడువు తేదీలను (ఎక్స్ పైరీ డేట్లు) స్వయంగా తనిఖీ చేశారు, గడువు ముగిసిన లేదా గడువు సమీపిస్తున్న మందులను వెంటనే వేరు చేసి నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు.

రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఔట్ పేషెంట్ విభాగానికి చికిత్స కోసం వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యుల స్పందన, మందుల లభ్యత, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పరిశుభ్రత, మందుల నాణ్యత, రోగుల పట్ల మర్యాదపూర్వక వ్యవహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదన్నారు.

ఆసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పాల్వంచ మండలం సీతారాంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు, వారికి అందుతున్న విద్యా బోధన, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందుతున్నదా, భోజనం నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఈ తనిఖీల్లో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ దార ప్రసాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు

(మొదటి పేజీ తరువాయి...)

సమావేశమైన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా లిస్ట్–2, లిస్ట్–3లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సాంకేతిక పరిపాలనాపరమైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన పేద కుటుంబాలకు ఎలాంటి జాప్యం లేకుండా ఇళ్ల మంజూరు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయిన చోట వెంటనే సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే, నియోజకవర్గంలోని ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందే వరకు నిరంతరం ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృషి కొనసాగిస్తానని స్పష్టం చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన రామిశెట్టి నరసింహారావు, ఆవుల వెంకట రమణ, దేవుళ్ల స్వరూప్‌లు చికిత్స పొందుతున్న వార్డులను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆసుపత్రి వైద్య బృందానికి సూచించారు.ఈ ముగ్గురు బాధితుల అత్యవసర శస్త్రచికిత్సలు, వైద్య ఖర్చుల కోసం ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున మొత్తం రూ.7.50 లక్షల విలువైన ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి, వాటిని





స్వయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు వైద్యానికి అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఖరీదైన వైద్య చికిత్స అవసరమైన సమయంలో తమ సమస్యను గుర్తించి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సకు ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రభుత్వ ఆర్థిక సహాయం కూడా అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు బాధితులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు గృహ వసతి, ఆరోగ్య భద్రత వంటి ప్రాథమిక అవసరాల కల్పనే తన ప్రజాప్రతినిధి బాధ్యతగా భావిస్తున్నానని, అశ్వారావుపేట నియోజకవర్గంలోని ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పాత ఇనుమునూ వదలని కాంగ్రెస్ నాయకులు

- వేలాది రూపాయల ప్రభుత్వ ఆస్తి అక్రమార్కుల పాలు



**అశ్వారావుపేట ,ప్రజా జ్యోతి ( ఆగస్టు 6):** మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల పరిస్థితి ఎలా ఉందంటే ప్రభుత్వానికి చెందిన పాత ఇనుమును కూడా వదిలే పరిస్థితి కనిపించడం లేదు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్డు నందు గల ఇరిగేషన్ శాఖ క్వార్టర్స్ నందు కోత మిషన్ కు నీటిని సప్లై చేయడానికి గాను సుమారుగా 40 సంవత్సరాల క్రితం ఐరన్ వాటర్ ట్యాంకును అప్పటి ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఏర్పాటు చేశారు. గడిచిన ఆరు ఏడు సంవత్సరాలుగా ఈ వాటర్ ట్యాంకు శిధిలావస్థకు చేరింది. ఇదే సమయంలో ఇరిగేషన్ కు చెందిన స్థలాన్ని ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి గాను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. ఆ సమయంలో ఆ ప్రదేశంలో ఉన్న వందల సంవత్సరాల నాటి చెట్లను భవనాలను అన్నింటిని కూల్చివేసి మైదానాన్ని శుభ్రపరిచారు. ఇది ఇలా ఉండగా ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ వాటర్ ట్యాంక్ ను గురువారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పూర్తిగా డిస్మెంటల్ చేసి సుమారు టన్నున్నరకు పైగా పాత ఇనుమును అక్రమంగా కాచేశారు. దీని విలువ 40 వేల రూపాయల పై మాట అంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ విధంగా వేలాది రూపాయల ప్రభుత్వ ఆస్తి అక్రమార్కుల పాలై పోతున్నాసరే సంబంధిత శాఖల అధికారులు ఎవరూ కనీసం దీని వైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల పట్టణంలో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పట్టణంలో వందలాది కోట్ల రూపాయల పనులకు అక్రమంగా ఆంధ్రా నుండి లక్షల రూపాయల విలువైన ఇసుకను అక్రమంగా ఆంధ్రా నుండి రవాణా చేసి లక్షలు గడుస్తున్న అధికార పార్టీ నాయకులు పాత ఇనుమును కూడా వదలక పోవడం పట్ల పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకొని అక్రమార్కుల నుండి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కేజీబీవీ అన్నపురెడ్డిపల్లిలో స్పాట్ అడ్మిషన్లు

- 7వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీ
- ఆగస్టు 14 వరకు దరఖాస్తుల స్వీకరణ



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ )లో 2026–27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి డి. శారద ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతిలో ఐదు ఖాళీ సీట్లు ఉండగా, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలి ఉన్న ఖాళీ సీట్లకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.ఆసక్తి గల విద్యార్థినులు తమ విద్యార్హతలు, అవసరమైన ధ్రువపత్రాలతో తల్లిదండ్రుల సమక్షంలో కేజీబీవీ, అన్నపురెడ్డిపల్లి కార్యాలయాన్ని సంప్రదించి ప్రవేశం పొందాలని ప్రత్యేక అధికారి డి. శారద సూచించారు.

## మహిళా సమాఖ్య భవన నిర్మాణంపై సందేహాలు?

- పునాది వద్ద ఖాళీలు... నాణ్యతపై ప్రశ్నలు!
- ప్రజాధనంతో నిర్మిస్తున్న భవనంపై స్థానికుల ఆందోళన – సాంకేతిక తనిఖీకి డిమాండ్



**అశ్వరావుపేట: ఆగస్టు 6 ప్రజా జ్యోతి** మహిళా సమాఖ్య భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ స్థలంలో పునాది దిగువ భాగంలో మట్టి కొట్టుకుపోయినట్లు, ఖాళీలు కనిపిస్తున్నట్లు ఫోటోలు వెలుగులోకి రావడంతో భవనం భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.స్థానికుల కథనం ప్రకారం, భవనం నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా పాటించారా లేదా అనే అంశంపై సంబంధిత అధికారులు వెంటనే పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మిస్తున్న భవనం కావడంతో ప్రతి దశలో నాణ్యతను నిర్ధారించాలని కోరుతున్నారు. అధికారులకు ప్రశ్నలుపునాది నిర్మాణం సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా జరిగిందా?నిర్మాణాన్ని ఇంజినీరింగ్ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేశారా?ఫోటోలో కనిపిస్తున్న ఖాళీలకు కారణం ఏమిటి?నిర్మాణ నాణ్యతపై స్వతంత్ర సాంకేతిక పరీక్ష నిర్వహిస్తారా?స్థానికుల డిమాండ్
మహిళా సమాఖ్య భవనం నిర్మాణాన్ని వెంటనే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి, లోపాలు ఉంటే సరిదిద్దాలని, ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణ నాణ్యతపై స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తూ సాంకేతిక విచారణ కోరుతున్నారు."

## ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో ప్రొ. జయశంకర్ జయంతి వేడుకలు

- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని విద్యార్థులకు వివరించిన ఎంఈఓ ఆనంద్ కుమార్




**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండలంలో గల ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు.మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ మలి దశ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా విశిష్ట సేవలందించారని అన్నారు. భావజాల వ్యాప్తి, ప్రజా ఉద్యమాలు, రాజకీయ ప్రక్రియ అనే మూడు మార్గాల ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన జరగాలని ఆయన ఆకాంక్షించారని తెలిపారు. 1952లో ఫజల్ అలీ నాయకత్వంలోని రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ ముందు తెలంగాణ ప్రజల అభిప్రాయాలను ధైర్యంగా వినిపించిన మహనీయుడిగా జయశంకర్ నిలిచారని పేర్కొన్నారు. పదో తరగతి పాఠ్యపుస్తకంలోని "తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం" పాఠం రూపకల్పనలో కూడా ప్రొఫెసర్ జయశంకర్, ప్రొ. కోదండరాం, ప్రొ. తిరుమలి, ప్రొ. అడపా సత్యనారాయణ, ప్రొ. విజయ్‌బాబుతో కలిసి కీలక పాత్ర పోషించారని వివరించారు.జయశంకర్ ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు తెలంగాణ ఉద్యమ చరిత్ర, జయశంకర్ సేవలపై ప్రసంగాలు చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునంద రెడ్డి, శాంతకుమారి, రాజ్యలక్ష్మి, బాబురావు, వెంకటేశ్వరరావు, బాలు, సుశీల, పద్మ, ప్రసాద్, కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, ఖాసీం, సీఆర్పీ శిరీష పాల్గొన్నారు.

## కొమరం భీమ్ విగ్రహానికి స్థలం కేటాయించాలి

- తహసీల్దార్ కు ఆదివాసి నాయకుల వినతి
- మండల కేంద్రంలో విగ్రహం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో కొమరం భీమ్ విగ్రహం ఏర్పాటు కోసం తగిన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఆదివాసి నాయకులు గురువారం తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. అన్నపురెడ్డిపల్లి మండల ఆదివాసి అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర ఆధ్వర్యంలో తహసీల్దార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన అమరవీరుడు కొమరం భీమ్ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయడానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూల చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మడివి నాగేంద్రబాబు, తాటి చంద్రరావు, సున్నం వెంకటేష్, సున్నం సుధాకర్, గుర్రం బాలకృష్ణ, భీముడుగూడెం సర్పంచ్ కీసరి కృష్ణ, వాడే రవి తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థినిలకు అసౌకర్యాలు కలగవద్దు

- ఎస్టి బాలికల వసతి గృహాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్



**ఇల్లందు, ఆగస్ట్ 6 (ప్రజా జ్యోతి )** ఎస్టి వసతి గృహంలోని విద్యార్థినిలకు ఎలాంటి అసౌకర్యాలు కలగవద్దని మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ అన్నారు. గురువారం ఎస్టీ బాలికల వసతి గృహాన్ని చైర్ పర్సన్ పరిశీలించారు. వసతి గృహంలో కలియ తిరుగుతూ సమస్యలను వార్డెన్ సునితను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేద, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాన్యమైన విద్య అందించడం ప్రభుత్వ లక్ష్యమని, విద్య హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కొరం కనకయ్య నిరంతరం కృషి చేస్తున్నారని, విద్యార్థినిలకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దొడ్డ డానియల్, నాయకులు దళిత రత్న మేకల శ్యామ్, సుఖాంత్ మిత్ర, దొడ్డ బాబి, కమలాకర్, చంటి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే శిశువుకు రక్షణ



**చర్ల, ఆగస్టు 06:(ప్రజా జ్యోతి):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చర్ల మండల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆర్.కొత్తగూడెం సెక్టార్‌లోని కుదునూరు-1 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ తాటి ఆదిలక్ష్మి మాట్లాడుతూ నవజాత శిశువుకు పుట్టిన గంటలోపే ముర్రు ఇవ్వడం ఎంతో ముఖ్యమని తెలిపారు. శిశువుకు తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు తల్లిపాలను కొనసాగించాలని తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలు శిశువు సంపూర్ణ ఎదుగుదలతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.అనంతరం గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, పోషకాహారంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంజ కమల, ఉప సర్పంచ్ సిద్ది కిరణ్‌బాబు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాలు చిరస్మరణీయం

- బీఆర్ఎస్ మండల కమిటీ ఘన నివాళి



**చర్ల, ఆగస్టు 06: (ప్రజా జ్యోతి ):** ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా చర్ల బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. మండల కన్వీనర్ దొడ్డి తాతారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ 1934 ఆగస్టు 6న వరంగల్ జిల్లాలో జన్మించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ ప్రజలపై జరుగుతున్న అన్యాయాన్ని దేశవ్యాప్తంగా వినిపిస్తూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా నిలిచారని అన్నారు . తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని ప్రత్యక్షంగా చూడాలన్న ఆయన ఆకాంక్ష నెరవేరకముందే 2011లో కన్నుమూసినా ఆయన ఆశయాలు నేటికీ తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య జయశంకర్ సేవలు చిరస్మరణీయమని ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, తోటపల్లి మాధవరావు, పంజా రాజు, కాకి అనిల్, గోరింట్ల వెంకటేశ్వరరావు, నేరబోయిన చంద్రశేఖర్, గాదంశెట్టి కిషోర్, కట్టం కన్నారావు, పాసిగంటి సంతోష్, సృజన్, చెన్నూమల్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల నివారణకు ఆరోగ్య శిబిరాలు

- ఇంటింటికి ఫీవర్ సర్వేలు నిర్వహించాలి- డాక్టర్ హారిక



**చర్ల, ఆగస్టు 06: (ప్రజా జ్యోతి ):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హారిక సూచించారు. ఆమె ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని సబ్ సెంటర్ గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంతో పాటు పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరాలు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహిస్తూ జ్వరాల బారినపడిన వారిని గుర్తించి వెంటనే వైద్య సేవలు అందించాలని అన్నారు . గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అవసరమైన మందులు అందించాలని వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని ఏ గ్రామంలోనైనా వ్యాధుల తీ వ్రత కనిపించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తక్షణ చ ర్యలు తీసుకోవాలని సిబ్బందికి స్పష్టం చేశారు.పాఠశాలల్లో నిర్వహించిన ప్ర త్యేక ఆరోగ్య శిబిరాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణకు ఫీవర్ సర్వేలు, ఆరోగ్య శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

## ప్లాంటేషన్ పనుల పరిశీలన

**చర్ల, ఆగస్టు 06: (ప్రజా జ్యోతి ):** చర్ల అటవీ రేంజ్ పరిధిలో చేపడుతున్న ప్లాంటేషన్ పనులను ఉన్నత అటవీశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. వరంగల్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (సీసీఎఫ్ ) భీమా నాయక్, భద్రాద్రి కొత్తగూడెం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్ వో ) సిద్ధార్థ విక్రమ్ సింగ్ చర్ల రేంజ్ పరిధిలోని ఒడ్డిపేట, సుబ్బంపేట, గన్నవరం వెస్ట్ బీట్ లలో జరుగుతున్న మొక్కల పెంపకం పనులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్లాంటేషన్ పనుల పురోగతిని పరిశీలించిన అధికారులు, మొక్కల సంరక్షణ, నిర్వహణ, నాణ్యత విషయంలో అటవీశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కల మనుగడ శాతాన్ని పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతతో అధికారులు సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు.

# ప్రజల తీర్పుతో బీజేపీ ప్రభుత్వానికి ముగింపు పలకాలి: షబ్బీర్ భాష

- అశ్వాపురంలో సిపిఐ ప్రజా చైతన్య యాత్రకు విశేష స్పందన
- సీతారామ ప్రాజెక్టు సాగునీటిని ముందుగా మండల రైతులకు అందించాలని డిమాండ్
- భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపు మేరకు



**అశ్వాపురం, ఆగస్టు 6, ప్రజాజ్యోతి** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, ప్రజలను చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో ఆగస్టు 6 నుంచి దేశవ్యాప్తంగా చేపట్టిన సిపిఐ ప్రజా చైతన్య ప్రచార యాత్ర బుధవారం సాయంత్రం అశ్వాపురం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానికంగా నిర్వహించిన బహిరంగ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి షబ్బీర్ భాష ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు.సభలో షబ్బీర్ భాష మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మరింత తీవ్రమయ్యాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, కార్మికుల హక్కులు దెబ్బతినడం వంటి అంశాలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు.సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని ముందుగా అశ్వాపురం మండలానికి విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలను ప్రభుత్వం నెరవేర్చాలని, సాగునీరు అందితే వేలాది ఎకరాలు సాగులోకి వచ్చి రైతుల ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ మాత్రమేనని షబ్బీర్ భాష పేర్కొన్నారు. రైతులు, కార్మికులు, గిరిజనులు, దళితులు, మహిళలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణలో సిపిఐ పార్టీ ముందుండి పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.ఈ ప్రజా చైతన్య యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ విధానాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరిస్తూ, స్థానిక సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా ఈ యాత్రలో భాగస్వాములు కావాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన కార్యకర్తలు, సిపిఐ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నినాదాలు చేస్తూ అశ్వాపురం ప్రధాన వీధుల గుండా ప్రజా చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ యాత్రకు స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు.

## జయశంకర్ జయంతి వేడుకలు



**ఇల్లందు, ఆగస్ట్ 6 (ప్రజా జ్యోతి )** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయంతి వేడుకలను గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని జయశంకర్ విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కమిషనర్ సందీప్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు



**చర్ల, ఆగస్టు 06: (ప్రజా జ్యోతి ):** చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నరేందర్ అధ్యక్షతన, జాతీయ సేవా పథకం పీ.ఓ జి. సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్. నరేందర్ మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల స్వపరిపాలన ఆకాంక్షకు ఆయన జీవితాంతం మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు . తెలంగాణ సాధనే తన జీవిత లక్ష్యంగా భావించిన జయశంకర్ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను ప్రజల ముందుకు గణాంకాలతో సహా తీసుకువచ్చి ఉద్యమానికి బలమైన సిద్ధాంత పునాది వేశారని అన్నారు.1934 ఆగస్టు 6న వరంగల్ జిల్లా అక్కంపేట గ్రామంలో జన్మించిన జయశంకర్ చిన్ననాటి నుంచే తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న వివక్షను గుర్తించి ఉద్యమ బాట పట్టారని వివరించారు. 1952 నాన్–ముల్కీ ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు దాదాపు ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ కోసం నిరంతర పోరాటం సాగించారని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, యువతలో ఉద్యమ చైతన్యం నింపిన మహనీయుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.ప్రత్యేక తెలంగాణ సాధన కోసం శాంతియుత మార్గంలో ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తూ ప్రతి గ్రామం, ప్రతి వీధిలో ప్రజలను చైతన్యపరిచిన గొప్ప మేధావి జయశంకర్ అని అన్నారు . మన నిధులు మనకే, మన ఉద్యోగాలు మన పిల్లలకే అనే ఆయన ఆశయాలు నేటికీ ప్రతి తెలంగాణ వాసికి స్ఫూర్తినిస్తున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో జి. సుధాకర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ–విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమీకృత వ్యవసాయానికి రాష్ట్రస్థాయి గుర్తింపు

- పూసం సతీష్‌కు ఉత్తమ రైతు పురస్కారం







**చర్ల, ఆగస్టు 06(ప్రజా జ్యోతి):** చర్ల మండలం ఉంజుపల్లి గ్రామానికి చెందిన గిరిజన యువ రైతు పూసం సతీష్ కుమార్‌కు సమీకృత వ్యవసాయ విధానంలో (ఐఎఫ్ఎస్) విశేష ప్రతిభ కనబరిచినందుకు సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ (సీపీఎఫ్), బీఎల్ఆర్ఎఫ్, హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తన్ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రం సంయుక్తంగా నిర్వహించిన 24వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఉత్తమ రైతు అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు.సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో నాలుగు వేల మంది చిన్న, సన్నకారు గిరిజన రైతు కుటుంబాల జీవనోపాధి మెరుగుపరిచే లక్ష్యంతో పలు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్ (ఐఎఫ్ఎస్) విధానాన్ని ప్రోత్సహిస్తుండగా ప్రస్తుతం రెండు మండలాల్లో 16 మంది రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తూ ఆదాయ వనరులను పెంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు అన్నారు .ఈ సందర్భంగా పూసం సతీష్ కుమార్ మాట్లాడుతూ తన రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో ఫార్మ్ పాండ్ ఏర్పాటు చేసి అందులో 800 చేప పిల్లలను పెంచుతున్నానని తెలిపారు. పాండ్ గట్లపై పండ్ల మొక్కలు, దిగువ భాగంలో కూరగాయల సాగు చేయడంతో పాటు సంస్థ సహకారంతో 100 కోళ్ల పెంపకాన్ని కూడా చేపట్టినట్లు చెప్పారు. ఈ సమీకృత వ్యవసాయ విధానం ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 1.50 లక్షల ఆదాయం పొందినట్లు తెలిపారు. ఇందులో కేవలం మూడు నెలల్లో కూరగాయల సాగు ద్వారానే రూ.40 వేల ఆదాయం రావడం విశేషమన్నారు.ప్రాజెక్టు కార్యకలాపాలకు నిరంతరం సహకరిస్తున్న కుర్నాపల్లి గ్రామ సర్పంచ్ శ్యామల తిరుపతిరావును సీపీఎఫ్ సంస్థ 'బెస్ట్ కమ్యూనిటీ లీడర్' అవార్డుతో సత్కరించింది.ఈ సందర్భంగా చర్ల ప్రాజెక్టు అధికారి క్రిష్ణతో పాటు సిబ్బంది వెంకటేశ్వర్లు, వితేష్, దుర్గారావు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణ సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 6,(ప్రజా జ్యోతి)** తెలంగాణ సాధనలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం అంకితభావంతో చేసిన కృషి రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆయన చూపిన మార్గం, ఆయన ఆలోచనలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు . సమాజ అభ్యున్నతి, ప్రజా సంక్షేమం కోసం ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, ప్రజాసేవలో ఉన్న అధికారులు, ఉద్యోగులు మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పించారు.

# కేజ్ వీల్స్ తో రోడ్లపై ట్రాక్టర్లు నడిపితే కేసులే..

- ప్రత్యేక తనిఖీలకు దమ్మపేట పోలీసులు సిద్ధం
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు: ఎస్సై రాజేష్ కుమార్





**దమ్మపేట, ఆగస్టు 6(ప్రజాజ్యోతి):** వ్యవసాయ పనులకు వినియోగించే కేజ్ వీల్స్, ఫుల్ వీల్స్ అమర్చిన ట్రాక్టర్లను ప్రజా రహదారులపై నడిపితే కఠిన చర్యలు తప్పవని దమ్మపేట పోలీసులు హెచ్చరించారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రాజేశ్ కుమార్ సూచించారు.పొలాల్లో బురద నేలల్లో పని చేసేందుకు రూపొందించిన కేజ్ వీల్స్‌ను రహదారులపై వినియోగించడం వల్ల బీటీ రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, దీంతో ప్రభుత్వానికి ఆర్థిక నష్టం వాటిల్లడంతో పాటు ప్రజలకు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. రోడ్ల ఉపరితలం దెబ్బతినడం, గుంతలు ఏర్పడడం, ఇతర వాహనాలు అదుపు తప్పే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు ప్రధాన రహదారులపై తిరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇకపై ఇలాంటి ట్రాక్టర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, మోటారు వాహన చట్టంలోని నిబంధనల మేరకు కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్పష్టం చేశారు.వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే కేజ్ లేదా ఫుల్ వీల్స్‌ను తొలగించి సాధారణ రబ్బరు టైర్లను అమర్చిన తర్వాతే రహదారులపై ట్రాక్టర్లను నడపాలని సూచించారు. రహదారుల పరిరక్షణ ప్రతి వాహనదారుడి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా ఇతర ట్రాఫిక్ నిబంధనలపైనా ఎస్సై రాజేశ్ కుమార్ అవగాహన కల్పించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, కార్లలో సీటుబెల్ట్ ధరించకపోవడం వంటి ఉల్లంఘనలపై కూడా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత రహదారుల నిర్మాణానికి ప్రతి ఒక్క రూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పాఠశాల విద్యార్థుల ప్రతిభకు పురస్కారం

- వంగల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక నగదు





**పాల్వంచ, ఆగస్టు 6, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కేటీపీఎస్)లో పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను వంగల ఫౌండేషన్ సత్కరించి, ఒక్కో విద్యార్థికి రూ. 10 వేల చొప్పున ప్రోత్సాహక నగదును చెక్కుల రూపంలో అందజేసింది.పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సంగమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పాల్వంచ ప్రాంతంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు వంగల ఫౌండేషన్ అందిస్తున్న సహాయం అభినందనీయమని అన్నారు. ఇలాంటి ప్రోత్సాహం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి ఉన్నత లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని పేర్కొన్నారు.వంగల ఫౌండేషన్ ప్రతినిధి జలీల్ మాట్లాడుతూ, స్పాంజ్ ఐరన్ సంస్థ తొలి సీఎండీగా వంగల సత్యనారాయణ సేవలందించారని గుర్తు చేశారు. అలాగే ఎల్పీజీ గ్యాస్ గోదాం ఏర్పాటులో కూడా ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలనే సంకల్పంతో వంగల ఫౌండేషన్ ద్వారా ప్రతి ఏడాది ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు.ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న మీనా వంగల వారి కుమార్తె చిత్ర సూడు మరియు అల్లుడు అనిల్ సూడు ఆధ్వర్యంలో వంగల ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన గుగులోతు ధరణి, దాసి హేమంత్, ఇరుకు స్నేహిత మరియు చర్ల శరత్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో జలీల్ రూ.10 వేల చొప్పున చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, మహాలక్ష్మి , శంకర్, శ్రీలత, శిరీష, సమ్మయ్య, రమేష్, బాబురావు తదితరులు పాల్గొని వంగల ఫౌండేషన్ సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# కార్పొరేషన్ డివిజన్లలో విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

- పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి
- సర్వసభ్య సమావేశంలో డివిజన్ సమస్యలను ప్రస్తావించిన కార్పొరేటర్



**పాల్వంచ, ఆగస్టు 6, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో విద్యుత్ వీధిదీపాల కొరత తీవ్రంగా ఉందని, వెంటనే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు భద్రత కల్పించాలని పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి కోరారు.గురువారం జరిగిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, అనేక కాలనీలు రాత్రివేళల్లో అంధకారంలో మునిగిపోతున్నాయని, దీంతో పాములు, విషపురుగులు సంచరించడంతో పాటు దొంగతనాల భయం కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో వెంటనే విద్యుత్ వీధిదీపాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

**పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి ...** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాత పాల్వంచ ప్రాంతంలోని డ్రై న్లు చెత్తాచెదారంతో నిండిపోయాయని, పారిశుధ్య సిబ్బంది కొరత వల్ల శు భ్ర త పనులు సకాలంలో జరగడం లేదని విమలాదేవి పేర్కొన్నారు. అదనపు పారిశుధ్య కార్మికులను నియమించి, డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం తో పాటు శానిటేషన్ పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.

**మిషన్ భగీరథ పైప్‌లైన్లు పూర్తి చేయాలి ...** పాత పాల్వంచ 46వ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలకు ఇప్పటికీ మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ప్రజలకు తాగునీటి సరఫరా అందడం లేదని ఆమె తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి లేవనెత్తిన సమస్యలపై స్పందించిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ మరియు కమిషనర్ సుజాత సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.